పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- ఎమ్మెల్యే బీఎల్ఆర్

మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, ఆగస్టు 13 : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 25వేల మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా మహ తేజ రైస్‌మిల్ ఆధ్వర్యంలో 250 మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా వ్యాపార, వాణిజ్య సంఘాల వారు, విద్యావంతులు, మేధావులు వన మహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదర్శపాఠశాల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- భోజన విరామంలో ఉపాధ్యాయుల నిరసన

పీఏపల్లి ఆదర్శపాఠశాలలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

పెద్దఅడిశర్లపల్లి, ఆగస్టు 13 : ఆదర్శపాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీఏపల్లి లోని పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 12 సంవత్సరాల నుంచి బదిలీలు నిర్వహించక పోవడంతో కుటుంబాలకు దూరంగా ఉండాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని, ప్రమోషన్లు హెల్త్ కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. తాత్కాలిక ప్రాతిపదికన పని చేసే వారిని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణయ్య, వెంకటయ్య, పాండురంగయ్య, రజిత, సైదానాయక్ పాల్గొన్నారు.

తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఫెలోగా రాంచందర్

టీఏఎస్ డైరెక్టర్ ప్రకాశ్‌కుమార్ నుంచి ఫెలో అవార్డు అందుకుంటున్న రాంచందర్

రామగిరి, ఆగస్టు 13: తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో ఫెలోగా నల్లగొండకు చెందిన డాక్టర్ రాంచందర్ ఎంపికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఆయనకు సంస్థ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్‌కుమార్ ఫెలో పత్రం, అవార్డును అందించారు. ఆయన భువనేశ్వర్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లో సీనియర్ సైంటిస్టుగా 18 సంవత్సరాలుగా పని చేస్తున్నారు. ప్రజల్లో వినికిడి లోపానికి కారణమైన జన్యుపరమైన విషయాలు అర్థం చేసుకొని తిరిగి వాటిని సవరించే పరిశోధనలకు, అరుదైన రుగ్మతలకు కారణమైన జన్యుశాస్త్ర రంగంలో చేసిన పరిశోధనలకు గుర్తింపుగా టీఏఎస్‌లో ఫెలోగా ఎంపిక చేశారు. రాంచందర్ నల్లగొండలోని ఎన్‌జీ కళాశాలలో డిగ్రీ, ఓయూలో ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ పట్టా పొందారు. మాలిక్యులర్ డయాగ్నస్టిక్ ప్రొటోకాల్‌ను అభివృద్ధి చేయడంలో, డీఎన్ఏ ఆధారిత డయాగ్నోస్టిక్ చిప్ అభివృద్ధిలోనూ ఆయన ప్రధాన పాత్ర పోషించారు. వివిధ అంశాలపై 70కి పైగా పరిశోధన పత్రాలు సమర్పించారు.

హక్కుల సాధన కోసం బీసీలు పోరాడాలి

- విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ అధ్యక్షుడు దాసోజు శ్రీనివాస్

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ సభ్యులు

రామగిరి, ఆగస్టు 13: చట్టసభల్లో, స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు, హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసోజు శ్రీనివాస్, పెండోట సోము పిలుపునిచ్చారు. ప్రముఖ సాహితీవేత్త, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు జూలూరి గౌరీశంకర్ రచించిన 'మా వాటా మాకే దక్కాలి' పుస్తకాన్ని నల్లగొండలోని జయశంకర్‌సార్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ హక్కుల సాధన, రిజర్వేషన్ల కోసం జూలూరి గౌరిశంకర్ చేస్తున్న కృషి అనిర్వచనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు శ్రీపాద కృష్ణామాచారి, బైరోజు రాఘవాచారి, తరిగోజు భీష్మాచారి, బీసీ సంస్థల నాయకులు దీకొండ వెంకటేశ్వర్లు, కనుగుల స్వామి, కడారి హనుమంతు, చింతల నరసింహ, మాలతీ, సువర్ణ పాల్గొన్నారు.

నేడు ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్ మేళా

నల్లగొండ రూరల్, ఆగస్టు 13: జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారి ఎస్.పద్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ, ఏఎన్ఎం, జీఎన్ఎం కోర్సులు పూర్తి చేసిన 18 నుంచి 35 సంవత్సరాల వయస్సులోపు ఉన్న అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు బయోడేటాతో పాటు విద్యార్హత సర్టిఫికెట్లు తీసుకొని జిల్లా కేంద్రంలోని ఉపాధి కల్పనా కార్యాలయానికి రావాలని సూచించారు. ఎంపికైనవారికి రూ. 10 నుంచి రూ.25వేల వేతనంతో కూడిన ఉద్యోగాలు కల్పించనున్నట్లు తెలిపారు. వివరాలకు సెల్ 7893420435 , 7895612963 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆర్ఎంపీ, పీఎంపీలకు భరోసా కల్పించాలి

- గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకన్న

మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు వెంకన్న

సూర్యాపేట టౌన్, ఆగస్టు 13 : ఏ రకమైన గుర్తింపు లేకుండా బతుకుతున్న గ్రామీణ వైద్యుల బతుకుకు భరోసా కల్పించాలని తెలంగాణ ఆర్ఎంపీ, పీఎంపీ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ఆ సంఘం జిల్లా 12వ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామీణ వైద్యులకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో రూ .10లక్షల క్యాష్‌లెస్ వైద్య సౌకర్యం కల్పించాలని, 20 ఏండ్ల అనుభవం ఉన్న ఆర్ఎంపీలకు సర్టిఫికెట్స్ ఇచ్చి భరోసా కల్పించాలని కోరారు. గ్రామీణ వైద్యులపై ఎన్ఎంసీ, ఆరోగ్యశాఖ, పోలీసుశాఖ దాడులను నిరోధించాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ పసునూరి సత్యానారాయణ, కోశాధికారి ఎండీ గఫార్, ఖమ్మం, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బి.వెంకటేశ్వర్లు, పుప్పాల లక్ష్మీనర్సయ్య, సహ అధ్యక్షుడు రహమతుల్లా, ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి రాజేందర్, కోశాధికారి జెరిపోతుల లక్ష్మణ్‌గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లంకొండ డాంగేగౌడ్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గూకంటి రాజబాబు, వెంకన్న, ఎస్.నాగరాజు పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలి : ఎస్పీ

పరేడ్ రిహార్సల్స్‌లో ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

సూర్యాపేట టౌన్, ఆగస్టు 13 : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పరేడ్ ప్రాక్టీస్‌ను ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ మంగళవారం పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. వేడుకలకు వచ్చే పౌరులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వేడుకల పరేడ్ కమాండర్‌గా అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి వ్యవహరించనున్నారు. ఆయన వెంట అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, జనార్దన్‌రెడ్డి, ఏఆర్ అడ్మిన్ ఆర్ఐ నారాయణరాజు, పరేడ్ సిబ్బంది ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- కలెక్టర్ నారాయణరెడ్డి
- మునుగోడు పీహెచ్‌సీ, పాఠశాల, హాస్టల్ తనిఖీ

మునుగోడు జడ్పీ హెచ్ఎస్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

మునుగోడు, ఆగస్టు13 : ఉద్యోగులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, ఎస్సీ హాస్టల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు, సిబ్బందితో సమావేశమై పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాను డ్రగ్స్ రహిత ప్రాంతంగా మార్చడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆస్పత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీ అయ్యే విధంగా చూడాలని, సిజేరియన్ కాకుండా సాధారణ డెలివరీలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం ప్రభుత్వపాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్ఓ శ్రీనివాస్, ఎంపీడీఓ కె.పూజ, తాసీల్దార్ నరేందర్, పీఆర్ ఏఈ సతీశ్‌రెడ్డి, వైద్యాధికారులు నర్మద, మాధురి, ఎంపీఓ, ఉపాధ్యాయులు, అధికారులు ఉన్నారు.

మోడల్ దవాఖానను ఎంపిక చేయాలి

నీలగిరి : ప్రతి నియోజకవర్గానికి ఒక మోడల్ దవాఖానను ఎంపిక చేయాలని, ఈ నెల 15 నుంచి ప్రసవాలతోపాటు చిన్న పిల్లల వైద్య చికిత్సలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి మంగళవారం వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 16 నుంచి వారం రోజులపాటు అన్ని మున్సిపాలిటీలు, గ్రామాల్లో జ్వర సర్వే నిర్వహించాలని, 15 నుంచి దేవరకొండ, మిర్యాలగూడ, సాగర్ ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు నల్లగొండ ప్రధాన దవాఖానలో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించాలన్నారు. అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్రం, డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్, డీసీహెచ్ఎస్ మాతృ, ప్రోగ్రామ్ అధికారి కల్యాణచక్రవర్తి పాల్గొన్నారు.

తాళం వేసిన ఇండ్లే టార్గెట్

- దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్
- బంగారు వెండి నగలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ శరత్‌చంద్ర పవార్

రికవరీ చేసుకున్న నగలను చూపుతున్న ఎస్పీ

నీలగిరి, ఆగస్టు 13 : తాళం వేసిన ఇండ్లను టార్గెట్ చేస్తూ.. ఉదయం వేళల్లో రెక్కీ నిర్వహించి రాత్రి వేళల్లో తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 31 తులాల బంగారం, కేజీ వెండి ఆభరణాలు, రూ. 28 వేల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, స్కూటీ, ఇనుపరాడ్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం ఉదయం సీసీఎస్, తిప్పర్తి పోలీసులు సంయుక్తంగా వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా చిట్యాల మండలం పెద్దకాపర్తికి చెందిన గుండెబోయిన మల్లేశ్, గుండెబోయిన మహేశ్ హోండా యాక్టివాపై వెళ్తూ అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేపట్టగా బంగారు నగలు, ఇనుపరాడ్లు ఉన్నట్లు గుర్తించారు. వారిని విచారించగా జూలై 30న తిప్పర్తి మండలం పెద్దసూరారంలో నగలను దొంగిలించి మిర్యాలగూడలో అమ్మేందుకు వెళ్తున్నట్లు తెలిపారు. మరింతగా విచారించగా నల్లగొండ, యాదాద్రిభువనగిరి జిల్లాలో కూడా పలు దొంగతనాలు చేసినట్లు వారు ఒప్పుకొన్నారు. చెప్పారు. వీరిద్దరితో పాటు పెద్దకాపర్తికి చెందిన నూతి సతీశ్, బైరబోయిన స్వామి, గుండెబోయిన సత్యం, బడే బాలకృష్ణ, యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రానికి చెందిన బొడిగే ఆశోక్ ముఠాగా ఏర్పడి 12 చోట్ల దొంగతనాలకు పాల్పడినట్లు ఎస్పీ వెల్లడించారు. వారిని కూడా అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వీరికి సహకరించిన మరోవ్యక్తి పరారీలో ఉన్నట్లు చెప్పారు. వీరంతా పగటిపూట తిరుగుతూ తాళం వేసిన ఇండ్లను టార్గెట్ చేసి రాత్రి వేళల్లో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ఎస్పీ వివరివంచారు. నల్లగొండ డీఎస్పీ కె.శివరాంరెడ్డి పర్యవేక్షణలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం.జితేందర్‌రెడ్డి, శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, తిప్పర్తి ఎస్ఐ రాజు, సీసీఎస్ కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించారు.

గంజాయి సాగు చేస్తే ప్రభుత్వ పథకాలు వర్తించవు

- జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్

సదస్సులో మాట్లాడుతున్న డీఏఓ శ్రవణ్‌కుమార్

నార్కట్‌పల్లి, ఆగస్టు 13 : రైతులు ఎవరైనా గంజాయి సాగు చేస్తే వారికి ప్రభుత్వం అందించే పథకాలు వర్తించవని జిల్లా వ్యవసాయ అధికారి పి. శ్రవణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డ్రగ్స్ వాడటం వల్ల యువత పెడుతోవ పడుతున్నదని, ఆరోగ్యం పరంగా నష్టపోతున్నదని తెలిపారు. గంజాయి నిర్మూలనలో రైతులు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నర్సిరెడ్డి, ఏడీఏ రామారావు నాయక్, రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ వీరప్ప, ఏఓ వై. గిరిప్రసాద్, ఏఈఓలు పాల్గొన్నారు.

గంజాయి సాగు చేస్తే చర్యలు : ఏడీఏ

మిర్యాలగూడ(వేములపల్లి) : రైతులు తమ పొలాల్లో గంజాయి సాగు చేస్తే చర్యలు తప్పవని ఏడీఏ పోరెడ్డి నాగమణి హెచ్చరించారు. మంగళవారం వేములపల్లి రైతువేదికలో గంజాయి సాగు నిర్మూలనపై రైతులకు అవగాహన కల్పించారు. ఎవరైనా గంజాయి సాగు చేసినట్లు తెలిస్తే వెంటనే వ్యవసాయ అధికారులకు గానీ, పోలీసులకు గానీ సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ రుషేంద్రమణి, ఏఈఓలు నితిన్, సంతోశ్, మల్సూర్ పాల్గొన్నారు.

నర్సింహకు పలువురి నివాళి

నర్సింహ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గట్టుప్పల్, ఆగస్టు 13 : మండలంలోని వెల్మకన్నె గ్రామానికి చెందిన బట్టపోతుల నరసింహ గ్రామాభివృద్ధికి చేసిన సేవలు మరువ లేనివని మాజీ సర్పంచ్ దేవేందర్ బీరప్ప అన్నారు. నర్సింహ 3వ వర్ధంతి సందర్భంగా మంగళవారం గ్రామంలోని ఆయన విగ్రహానికి గ్రామస్తులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో దళితులకు భూములు ఇప్పించడంలో ఆయన కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ బట్టపోతుల ప్రదీప్‌కుమార్, డీలర్ వెంకన్న, బాల మహేశ్, యాదయ్య, షేక్ సైదులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి కొండభీమనపల్లి వాసి స్వాగతం


వాషింగ్‌టన్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న వ్యాపారవేత్త తిర్మల్‌రెడ్డి

దేవరకొండరూరల్, ఆగస్టు13 : అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డిని వాషింగ్‌టన్ డీసీ విమానాశ్రయంలో మండలంలోని కొండభీమనపల్లి గ్రామానికి చెందిన వ్యాపారవేత్త మునికుంట్ల తిర్మల్‌రెడ్డి స్వాగతం పలికారు. సీఎం పర్యటన పూర్తయ్యే వరకు ఆయనతో ఉన్నారు. సీఎం పర్యటనను విజయవంతం చేయడంలో ముఖ్య పాత్ర పోషించిన తిర్మల్‌రెడ్డిని సీఎం అభినందించారు.

'ఉపాధి హామీని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం ప్రభుత్వం కుట్ర'

మునుగోడు, ఆగస్టు13 : ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్గూరి నర్సింహ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో ఉపాధిహామీ పథకానికి రూ. 70వేల కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. ఉపాధి హామీ పనిదినాలను పెంచాలని, కూలీలకు రోజుకు రూ.700 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు ఉషయ్య, గోస్కొండ లింగయ్య, సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, ఉప్పునూతల రమేశ్, కాయతీ వెంకన్న, ఇరిగి సంజీవ, కొరె సత్తయ్య, పెంటయ్య, సైదయ్య పాల్గొన్నారు.

నేడు హాలియాలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

హాలియా, ఆగస్టు 13 : హాలియా మున్సిపాలిటీ పరిధిలోని రెడ్డి కాలనీ, వీరయ్యనగర్, అంగడి బజారులో బుధవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ బాలూనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంగడి బజారులో 11 కేవీ లైన్ మార్పిడి పనులు నిర్వహిస్తున్న దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

సత్యం కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ పరామర్శ

దేవరకొండరూరల్, ఆగస్టు13 : మండలంలోని అచ్చమ్మకుంట తండాకు చెందిన నేనావత్ సత్యం మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ గ్రామానికి వెళ్లి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాశ్, రవీందర్‌రెడ్డి, ఇద్దయ్య, చందునాయక్ ఉన్నారు.

గొర్రెల మందపై కుక్కల దాడి

శాలిగౌరారం, ఆగస్టు 13 : మండలంలోని ఇటుకులపహాడ్ గ్రామానికి చెందిన సైదులుకు చెందిన గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో ఐదు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. సైదులు గొర్ల మందను సోమవారం మేతకు తీసుకెళ్లి సాయంత్రం ఇంటి సమీపంలోని దొడ్డిలో తోలాడు. అర్ధరాత్రి కుక్కలు మందపై దాడి చేసి 5 గొర్రెలను కొరకడంతో మృత్యువాత పడినట్లు తెలిపాడు. దాంతో రూ. 50వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.

చెర్వుగట్టు హుండీ లెక్కింపు

నార్కట్‌పల్లి, ఆగస్టు 13 : మండలంలోని చెర్వుగట్టు దేవాలయ హుండీలను మంగళవారం లెక్కించారు. గుట్టకింద అమ్మవారి ఆలయ హుండీ ఆదాయం రూ. 4,51,460, గుట్టపైన స్వామివారి ఆలయ హుండీ ఆదాయం రూ.32,08,490 మొత్తం 60 రోజులకుగానూ రూ. 36,59,950 వచ్చినట్లు ఆలయ ఈఓ నవీన్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హాలియాలో భారీ వర్షం

హాలియా, ఆగస్టు 13: హాలియా పట్టణంతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ వేడి, ఉక్కపోత ఉండగా సాయంత్రం వాతావరణం చల్లబడి వర్షం కురియడంతో ప్రజలు ఉపశమనం పొందారు. చాలా రోజులుగా వర్షాలు లేక పంటలు ఎండుతుండడంతో ఆందోళనలో ఉన్న రైతులు వర్షంతో ఊరట చెందారు.

రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడితే చర్యలు

చందంపేట(నేరేడుగొమ్ము), ఆగస్టు 13 : రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని పౌరసరఫరాలశాఖ దేవరకొండ డివిజన్ అధికారి హనుమంతు శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని రేషన్ షాపును తనిఖీ చేశారు. 7 క్వింటాళ్ల బియ్యం నిల్వలు తక్కువగా ఉండడంతో డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేశారు. షాప్‌నెం.17 బాధ్యతలను కొత్తపల్లి రేషన్ డీలర్‌కు అప్పగించినట్లు తెలిపారు. ఈ విషయమై జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి, దేవరకొండ ఆర్డీఓకు నివేదిక అందించినట్లు పేర్కొన్నారు.

అవంతీపురం ఎస్‌బీఐ శాఖను తరలించొద్దు : మట్టిమనిషి

మిర్యాలగూడ, ఆగస్టు 11: మండలంలోని అవంతీపురం ఎస్‌బీఐ శాఖను మరో చోటికి తరలించొద్దని మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు బ్యాంక్ అధికారులను కోరారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎస్‌బీఐ వారు వ్యవసాయ మార్కెట్ ఆవరణలో 12 ఏండ్ల క్రితం ఏర్పాటు చేసిన బ్రాంచ్ వల్ల చుట్టు పక్కల గ్రామాల రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతున్నదన్నారు. అధికారులు బ్యాంక్‌ను వేరే ప్రాంతానికి తరలించాలని చూస్తున్నారని, దానిని విరమించుకోవాలని కోరారు.

విరాళాల సేకరణ

చిట్యాల, ఆగస్టు 13 : కేరళలోని వయనాడ్ వరద బాధితుల కోసం సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేశ్, అవిశెట్టి శంకరయ్య, జిట్ట సరోజన పాల్గొన్నారు.

దైవభక్తితో మానసిక ప్రశాంతత : ఎంపీ చామల

ఎడ్లబండిపై ఆలయానికి వెళ్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

శాలిగౌరారం, ఆగస్టు 13 : దైవభక్తితో మానసికంగా ప్రశాంతంగా ఉండొచ్చని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిత్తలూర్ గ్రామంలో మంగళవారం జరిగిన గ్రామదేవతల పండుగలో ఆయన పాల్గొన్నారు. గ్రామస్తులతో కలిసి ఎడ్లబండిపై గ్రామ పురవీధుల గుండా మహంకాళమ్మ ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నూక కిరణ్‌యాదవ్, మండలాధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, పాదూరి శంకర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఎర్ర రణీలాయాదగిరి, నాయకులు బండపెల్లి కొమరయ్యగౌడ్, బొమ్మగాని రవి, నోముల జనార్దన్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

సీఎం సహాయనిధి చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

మిర్యాలగూడ, ఆగస్టు 13: నియోజకవర్గానికి చెందిన 41 మందికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను మంగళవారం ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి పంపిణీ చేశారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డులోగల ఎమ్మెల్సీ కార్యాలయంలో 41 మంది బాధితులకు రూ.14,40,500 విలువగల చెక్కులను ఆయన అందించారు. బీఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

త్రిపురారం : మండలంలోని కామారెడ్డిగూడెం గ్రామ మాజీ సర్పంచ్ పొలగాని రామచంద్రయ్యగౌడ్ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి గ్రామానికి వెళ్లి రామచంద్రయ్యగౌడ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నిడమనూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, నాయకులు బుసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నర్సోత్తమరెడ్డి, మారయ్య, జానయ్య, సైదులు, సత్యం, కెతావత్ శంకర్‌నాయక్, కేశబోయిన జానయ్యగౌడ్, దోరెపల్లి వెంకటేశ్వర్లు, శ్రీధర్ ఉన్నారు,

సుంకిశాల ప్రమాదంపై సీబీఐ దర్యాప్తు జరిపించాలి

- బీజేఎల్పీ నాయకుడు మహేశ్వర్‌రెడ్డి

అధికారులను అడిగి ప్రాజెక్ట్ వివరాలు తెలుసుకుంటున్న బీజేపీ ఎమ్మెల్యేలు, నాయకులు

పెద్దవూర, ఆగస్టు 13: సుంకిశాల ప్రమాద ఘటనపై వెంటనే సీబీఐ, విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం సిఫారసు చేయాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని సుంకిశాల ప్రాజెక్టును ఎమ్మెల్యేలు రామారావు పటేల్, పాల్వాయి హరీశ్‌బాబు, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డితో కలిసి బీజేపీ నాయకుల బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుంకిశాల ప్రమాద ఘటన దురదృష్టకరమన్నారు. ఈ ఘటన ఈ నెల 2న జరిగితే ప్రభుత్వం వారం రోజుల పాటు గోప్యంగా ఉంచడానికి కారణాలు తెలుపాలన్నారు. ఈ ఘటన మీడియా ద్వారా వెలుగు చూడడం సిగ్గుచేటన్నారు. కాంట్రాక్టు సంస్థను కాపాడేందుకే ఇది చిన్న ఘటన అంటూ మంత్రులు చెబుతున్నారని పేర్కొన్నారు. వాటర్ బోర్డ్ అధికారుల అనుమతి తీసుకోకుండా మెఘా ఇంజినీరింగ్ ఏజెన్సీ రెండో టన్నెల్‌ను ఎందుకు ఓపెన్ చేశారని ప్రశ్నించారు. వేలా కోట్ల రూపాయల ప్రాజెక్ట్ కూలిపోతే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చిన్న నష్టంగా చెప్పడం ఆయన లోపాయికారి ఒప్పందాన్ని బయట పెట్టిందన్నారు. ఈ నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పాలన్నారు.

వారి వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, పిల్లి రామరాజు యాదవ్ ఉన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలి

- తాసీల్దార్ మధుసూదన్‌రెడ్డి

కేతేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

కేతేపల్లి, ఆగస్టు13 : మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తాసీల్దార్ మధుసూదన్‌రెడ్డి కోరారు. మాదక ద్రవ్యాల నిర్మూలనపై మండల కేంద్రంలోని రైతు వేదికలో అధికారులు, రైతులు, స్థానికులకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎస్ఐ శివతేజ, ఏఓ బి.పురుశోత్తం పాల్గొన్నారు

రైతులకు అవగాహన

చిట్యాల : వ్యవసాయ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని ఉరుమడ్ల రైతువేదికలో రైతులకు మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మాదకద్రవ్యాలకు యువత ఏవిధంగా బానిసలు అవుతున్నారో వీడియోల ద్వారా అవగాహన కల్పించారు. హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ, వ్యవసాయ అధికారి పగిడిమర్రి గిరిబాబు, వ్యవసాయ విస్తరణ అధికారులు మోహిన్, కృష్ణకుమారి, మనీష పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలు వద్దు

- బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్

మిర్యాలగూడ, ఆగస్టు 13: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీసీల కులగణన చేపట్టి 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. అలా చేయని పక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరో బీసీ ఉద్యమాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో రాయించు నరసింహ, ఎర్రబెల్లి గంగాధర్, మహేశ్వరపు నరేశ్, గాదెనబోయిన హరి, ఎలిజాల నవీన్, ఉపేందర్ పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

కొండమల్లేపల్లి, ఆగస్టు 13 : రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి మండలంలోని చిన్నఅడిశర్లపల్లి వద్ద చోటు చేసుకుంది. ఎస్ఐ రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాజ్‌కుమార్(38) మండల కేంద్రంలో తాపీ మేస్త్రీగా పని చేస్తున్నాడు. చిన్నఅడిశర్లపల్లి సమీపంలోని ధాబాలో భోజనం చేసి రోడ్డు దాటుతుండగా కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దాంతో రాజ్‌కుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడిఅక్కడే మృతి చెందాడు.

గంజాయిపై అవగాహన

తిరుమలగిరి(సాగర్) : గంజాయితో జీవితాలు చిత్తవుతాయని, దానిని అమ్మినా, కొన్నా, తాగినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనునాయక్ హెచ్చరించారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గంజాయి నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో కేంద్ర మంత్రి పూజలు

చిట్యాల, ఆగస్టు 13 : కేంద్ర భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మంగళవారం వెల్మినేడు శివారులోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన మంత్రికి పూజారులు భానుప్రకాశ్ శర్మ, వల్లూరి నిఖిల్ శర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వచనం అందించారు. సిబ్బంది మల్లారెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మునుగోడు, ఆగస్టు13 : మండల కేంద్రానికి చెందిన మిర్యాల వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి గుత్తావెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్టు చెర్మన్ అమిత్‌రెడ్డి రూ.10వేల ఆర్థిక సాయం పంపించగా మంగళవారం ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు అందించారు. కార్యక్రమంలో నాయకులు బండారు రఘు, ట్రస్ట్ సభ్యులు ఉయ్యాల నరేశ్‌గౌడ్, నిసార్, సాయిరాం పాల్గొన్నారు.